క్లుప్తంగా

నేడు వైకుంఠ ఏకాదశి



గోదాగోకులంలో రంఘనాథ స్వామి

కర్నూలు కల్చరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలునగరంతో పాటు, నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, బనగానపల్లె, అహోబిలం, మంత్రాలయం, ఆర్ఎస్ రంగాపురం మద్దిలేయ్య క్షేత్రం, పెరవలి తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో శనివారం ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయి. తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు ప్రారంభంకానున్నాయి.

కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్



వినీల

కర్నూలు కల్చరల్: కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు ఎ.వినీలకు డాక్టరేట్ లభించింది. జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయంలో ఆచార్య ఎస్ కాశీవిశ్వనాథ్, ఆచార్య సి.శోభాబిందు మార్గదర్శకంలో 'సెక్యూరిటీ మెకానిజమ్స్ ఫర్ మెడికల్ డేటా ఇన్ క్లౌడ్' అనే అంశం మీద ఆమె పీహెచ్‌డీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్ తెలిపారు. మెడికల్ డేటాను భద్రపరచడం, వినియోగించడంలో నాణ్యమైన పద్ధతులకు సంబంధించిన ఈ పరిశోధన తనకెంతో తృప్తినిచ్చిందని డాక్టర్ వినీల తెలియజేశారు.

ఎస్‌సీడీసీ రుణాలను గడువులోపు చెల్లించండి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా గొర్రెల పెంపకానికి రుణాలు పొందిన వారందరూ గడువులోపు రుణాలు చెల్లించాలని ఉమ్మడి జిల్లా గొర్రెల పంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలో యూనియన్ సర్వసభ్య సమావేశం చైర్మన్ అధ్యక్షత జరిగింది. ఆయన మాట్లాడుతూ... 203 మందికి యూనియన్ ద్వారా ఎన్‌సీడీసీ నిధులు రూ.8.50 కోట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గొర్రెల పంపకందారుల సహకార యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుభాన్‌బాషా, ప్యాపిలి గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం ఏడీ రామసుబ్బారెడ్డి, వెటర్నరీ అసిస్టెంటు సర్జన్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానిది నిరంకుశ పాలన



కర్నూలు(సెంట్రల్): దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశ పాలన సాగిస్తున్నారని వామపక్షాల నాయకులు విమర్శించారు. పార్లమెంట్‌కు భద్రత కల్పించలేని ప్రధాని..దేశాన్ని ఏమి కాపాడుతారని ప్రశ్నించారు. శుక్రవారం వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లాసహాయ కార్యదర్శి నబీరసూల్ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బీజేపీ డొల్లతనాన్ని ప్రశ్నించిన ఎంపీలను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. నాయకులు ఎండీ ఆనందుబాబు, రాజశేఖర్, రామకృష్ణ, నగేష్, విజయ్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు,నాగరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

కర్నూలు(లీగల్): శాశ్వత లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, సభ్యులు టి.శివ శంకర్‌రెడ్డి, డి.రాజుబాబు పేర్కొన్నారు. తన సతీమణి మృతికి కారణమైన బాలాజీ నర్సింగ్ హోమ్‌పై కండిప్రసాద్ అనే వ్యక్తి లోక్‌అదాలత్‌ను ఆశ్రయించాడు. ఆసుపత్రి నిర్వాహకులకు నోటీసు జారీ చేసి పిలిపించి లోక్‌అదాలత్ చైర్మన్, సభ్యులు మాట్లాడారు. దీంతో ఫిర్యాది కండి ప్రసాద్‌కు మానవతా సహాయం కింద రూ.6 లక్షలు ఇచ్చేందుకు ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించడంతో వివాదం పరిష్కారమైంది. ఇరు పార్టీల న్యాయవాదులు కె.బలరాముడు, టి.మురళీధర్ పాల్గొన్నారు.

వైద్య సేవల్లో మిన్నగా..

- కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా పెద్దాసుపత్రి అభివృద్ధి
- గ్యాస్ట్రో ఎంట్రాలజీకి రూ.1.77 కోట్ల వైద్య పరికరాలు
- ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఈయూఎస్, ఈఆర్‌సీపీకి పరికరాలతో విశేష సేవలు
- ఏటా పది వేల మందికి పైగా చికిత్స
- పీజీ సీట్ల రాకతో మెరుగైన వైద్యసేవలు

కడుపులో గ్యాస్ సమస్య ఉందని ప్రైవేటు ఆసుపత్రికి వెళితే డాక్టర్ ఫీజు, స్కానింగ్, మందులతో కలిపి రూ.5 వేలకు పైగా బిల్లు అవుతుంది. అదే ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే ఒక్క రూపాయి కూడా ఖర్చు కావడం లేదు. కాలేయంలో సమస్య ఉందని తెలిసి ప్రైవేటు డాక్టర్ వద్దకు వెళితే పరీక్షలు, మందులకు వేలకు వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. అదే ప్రభుత్వ ఆసుపత్రిలో అయితే అవన్నీ ఉచితంగా లభిస్తున్నాయి. ఇదీ నాడు అరకొర సేవలకే పరిమితమైన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం నేడు సాధించిన పూర్తిస్థాయి అభివృద్ధికి నిదర్శనం.



పెద్దాసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగం

కర్నూలు(హాస్పిటల్): ఐదేళ్ల క్రితం గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగంలో ఒక్క డాక్టర్ మాత్రమే పనిచేసేవారు. ఈ కారణంగా ఇతర పరీక్షలు పూర్తిస్థాయిలో నిర్వహించేవారు కాదు. అప్పట్లో వారంలో రెండు రోజులు ఓపీ ఉంటే ఇప్పుడు ప్రతిరోజూ ఓపీ చూస్తున్నారు. అప్పట్లో వారంలో రెండు రోజులు మాత్రమే కొలనోస్కోపి, ఎండోస్కోపి వంటి పరీక్షలు చేసేవారు. కానీ ఇప్పుడు ఒక వైపు ఓపీ చూస్తేనే మరోవైపు ప్రతిరోజూ ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ విభాగంలో ప్రస్తుతం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ మినహా అన్ని పోస్టులు ఫుల్‌గా ఉండటంతో మెరుగైన సేవలు లభిస్తున్నాయి. దీంతో గతంలో ఎన్నడూలేనంత విధంగా రోగుల రద్దీ ఈ విభాగానికి పెరిగింది. ఈ విభాగంలో జీర్ణాశయం, అన్నవాహిక, కాలేయం, పిత్తాశయం, పెద్దపేగు, క్లోమగ్రంథి, ప్లీహం వ్యాధులకు చికిత్స చేస్తారు. గత ప్రభుత్వం చివరలో రెండు పీజీ సీట్లు రాగా ఈ ప్రభుత్వంలో మరో రెండు పీజీ సీట్లు రావడంతో ఏడాదికి నలుగురు కొత్త పీజీలు వస్తున్నారు. ఫలితంగా కేవలం పీజీ వైద్యవిద్యార్థులే మూడేళ్లకు 12 మంది అందుబాటులో ఉంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగంలో ఈయూఎస్ మిషన్‌ను రూ.కోటితో కొనుగోలు చేశారు. అలాగే రూ.22లక్షలతో మొబైల్ ఎక్స్‌రే యూనిట్, రూ.35లక్షలతో డబుల్ బెలూన్ ఎంటిరోస్కోపి, రూ.20లక్షలతో ఈఆర్‌సీపీ స్కోపి అందుబాటులోకి వచ్చాయి. ఈ మొత్తం పరికరాల కోసం ప్రభుత్వం రూ.1.77కోట్లు ఖర్చుచేసింది.



ఏర్పాటు చేసిన ఆధునిక వైద్యపరికరాలు

కార్పొరేట్‌కు మించి వైద్యసేవలు



గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్యసేవలు అందిస్తున్నాము. ప్రతిరోజూ ఓపీ నిర్వహించడంతో పాటు రోగిని వెనక్కి పంపకుండా అదే రోజే వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నాము. కార్పొరేట్ ఆసుపత్రులకు మిన్నగా ఆధునిక వైద్యపరికరాలతో రోగులకు వైద్యపరీక్షలు చేయడంతో పాటు చికిత్స అందిస్తున్నాము. హెపటైటిస్ వ్యాధులకు ఎంతో ఖరీదైన మందులను ఉచితంగా రోగులకు అందజేస్తున్నాము. ఫలితంగా రోగుల రద్దీ బాగా పెరిగింది.

–డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్, గ్యాస్ట్రో ఎంట్రాలజి హెచ్‌ఓడీ

అన్నీ పరీక్షలు ఉచితంగా చేశారు



నాకు లివర్‌లో ఇన్‌ఫెక్షన్ రావడంతో గత గురువారం ఈ విభాగంలో చేరాను. ఎక్స్‌రే, సీటీస్కాన్, అల్ట్రాసౌండ్, 2డి ఎకో, ఎండోస్కోపి పరీక్షలన్నీ ఉచితంగా చేశారు. కడుపులో ఏదో చిన్న కణితి ఉందన్నారు. ఇప్పుడు నాకు కొద్దిగా నయం అయ్యింది. వచ్చినప్పుడు ఉన్న వాంతులు, కడుపునొప్పి, ఆయాసం తగ్గాయి. ఇక్కడి వైద్యులు బాగా చూసుకుంటున్నారు. చికిత్సకు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు.

–టి. సుధాకర్, ప్యాపిలి

ప్రైవేటులో అయితే సాధ్యం కాదు



వాంతులు, ఆకలి వేయకపోవడం వంటి సమస్యలతో రెండు నెలలుగా ఈ విభాగానికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నాను. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, ఎండోస్కోపి, 2డి ఎకో, రక్తపరీక్షలు చేసి హెపటైటిస్–బి ఉందని తేల్చారు. ఎంతో విలువైన మందులను మూడు నెలలుగా ఉచితంగా ఇస్తున్నారు. ఇప్పుడు ఆరోగ్య సమస్య అధికం కావడంతో వారం రోజుల క్రితం చేరాను. డాక్టర్లు చేసిన చికిత్స కారణంగా ఇప్పుడు బాగుంది. ఇక్కడి డాక్టర్లు ఎంతో బాగా చూసుకున్నారు. ఇదే చికిత్సను ప్రైవేటులో అయితే చేసుకునే వాన్ని కాదేమో.

–శ్రీకృష్ణుడు, చెన్నంపల్లి గ్రామం, అవుకు

ఆరేళ్లలో అందించిన వైద్యసేవల వివరాలు

సంవత్సరం	ఎండోస్కోపి	కొలనొస్కోపి	ఈయూఎస్	ఈఆర్‌సీపీ
2018	3,606	341	---	86
2019	3,612	346	18	90
2020	1,105	119	15	20
2021	3,024	287	120	175
2022	3,700	235	191	262
2023(ఇప్పటి వరకు)	3,950	278	186	247
మొత్తం	18,997	1,706	530	880

గ్యాస్ట్రో ఎంట్రాలజిలో చేస్తున్న వైద్యపరీక్షలు

- **ఎండోస్కోపి:** మింగేటప్పుడు అడ్డుపడినప్పుడు, ఛాతిలో మంట, అకస్మాత్తుగా బరువు తగ్గడం, క్యాన్సర్ జబ్బుగా అనుమానించినప్పుడు, కాలేయ సమస్యలు, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు మింగినప్పుడు తీసేందుకు, అన్న వాహిక క్యాన్సర్‌కు ప్లాస్టిక్, మెటల్ స్టెంట్ వేసేందుకు, స్ట్రోక్ వచ్చి మింగడానికి ఇబ్బంది పడే వారికి పైపు వేసేందుకు, ఆహార నాళం ద్వారా ఆహారాన్ని పంపించేందుకు ఈ పరీక్ష చేస్తారు. దీంతో పాటు పలు రకాల వ్యాధినిర్ధారణకు బయాప్సీ(కణజాలం) తీసి పరీక్షకు పంపిస్తారు. ప్రైవేటుగా ఈ పరీక్షను రూ.2వేల నుంచి రూ.2500 వసూలు చేస్తారు. బయాప్సీ తీసేందుకు రూ.800, స్టెంట్ వేసేందుకు రూ.10వేలు, బ్యాండింగ్‌కు, నాణేలు తీసేందుకు రూ.5వేల నుంచి రూ.7వేలు ఛార్జి వసూలు చేస్తారు. ఇవన్నీ ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చేస్తున్నారు.
- **కొలనోస్కోపి:** మీటరు పొడవున్న పెద్దపేగులో జబ్బులను నిర్ధారించేందుకు ఈ పరీక్ష చేస్తారు. మలద్వారం గుండా ఈ పరీక్ష పరికరాన్ని పంపి పరీక్షిస్తారు. దీనివల్ల పెద్దపేగులో మొలలు, ఫిషర్, అల్సర్స్, క్యాన్సర్, గర్భసంచికి రేడియేషన్ ఇవ్వడం వల్ల కలిగిన ఇబ్బందులను గుర్తించేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. దీంతో పాటు బయాప్సీ తీసి వ్యాధినిర్ధారణ చేస్తారు. పెద్దపేగుకు ప్లాస్టిక్, మెటల్ స్టెంట్ వేసేందుకు, పేగులో రక్తస్రావం ఆపేందుకు ఈ పరికరాన్ని ఉపయోగిస్తారు. ఈ పరీక్షను ప్రైవేటుగా రూ.5వేల దాకా వసూలు చేస్తారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహిస్తున్నారు.
- **ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ (ఈయూఎస్):** జీర్ణాశయం చుట్టుపక్కల అవయవాల్లో లోపాలు గుర్తిస్తుంది. వ్యాధినిర్ధారణ చేయడానికి కణితి తొలగించేందుకు ఉపయోగిస్తారు. పాంక్రియాస్ వద్ద ఏర్పడిన కణితిని తొలగించవచ్చు. గ్యాస్ట్రో జెజినాస్టమిని బైపాస్ ద్వారా చేయవచ్చు.
- **ఈఆర్‌సీపీ:** ఎండోస్కోపి లాగానే ఈ పరీక్ష చేయ వచ్చు. క్యాన్సర్, పైత్యరస నాళంలో రాళ్లు తొలగించేందుకు ఉపయోగిస్తారు. ప్లాస్టిక్ స్టెంట్ అమరుస్తారు.

అధిక దిగుబడులు సాధించేందుకే ఈ-మిర్చా ప్రాజెక్టు

కర్నూలు(అగ్రికల్చర్): మిర్చి, టమాట సాగులో ఉత్పాదకత పెంచడానికి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేసేందుకు ఈ-మిర్చా 2.0 ప్రాజెక్టును ప్రారంభించినట్లు జిల్లా ఉద్యాన అధికారి పి.రామంజనేయులు తెలిపారు. శుక్రవారం కర్నూలులోని ఉద్యానభవన్‌లో జిల్లాలోని ఉద్యాన అధికారులు, ఉద్యాన సహాయకులకు జిల్లా ఉద్యానశాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థ సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మిర్చి, టమాట సాగులో రైతులకు ఎప్పటికప్పుడు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ ఉత్పాదకతను పెంచడంతో పాటు... పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఉద్యాన శాఖ డిజిటల్ గ్రీన్ ఆర్గనైజేషన్‌తో కలసి పని చేస్తోందన్నారు. ఈ-మిర్చా 2.0 ప్రాజెక్టు ద్వారా రైతులకు సాంకేతిక సలహాలు అందించనున్నట్లు వెల్లడించారు. డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు మస్తాన్‌వలి, వెంకటసాయి మాట్లాడుతూ... ఈ-మిర్చా ప్రజెక్టు విశిష్టతను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో సాంకేతిక ఉద్యాన అధికారి అనూష తదితరులు పాల్గొన్నారు.

కేవీఆర్ విద్యార్థిని అదృశ్యం

కర్నూలు కల్చరల్: కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని శుక్రవారం అదృశ్యమైంది. అనంతపురం జిల్లాకు చెందిన ఈ విద్యార్థిని కాలేజీ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ హోంసైన్స్ కోర్సు చదువుతుంది. శుక్రవారం ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకపోవడంతో అనుమానం వచ్చిన అధ్యాపకులు ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సీసీ పుటేజి పరిశీలించగా మధ్యాహ్నం సమయంలో ఆ విద్యార్థిని కలర్ డ్రస్‌లో సెక్యూరిటీ కళ్లుగప్పి తప్పించుకొని కళాశాల నుంచి బయటికి వెళ్లినట్లు ఉంది. వెంటనే ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేసినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

అవీ-ఇవీ

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారానికి 11వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీలు మానవహారం నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. వీరికి పలు ప్రజాసంఘాల మద్దతు తెలిపాయి.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కర్నూలు కల్చరల్: మండల పరిధిలోని ఉల్చాల జెడ్పీహెచ్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. మండల ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఈఓ ఆజాం ఖాన్, ఎంఈఓ వినోద్‌కుమార్, మాజీ మండల ఉపాధ్యక్షుడు డి.వాసు, గ్రామ సర్పంచ్ విద్యాసాగర్ విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

12వ రోజు న్యాయవాదుల దీక్షలు

కర్నూలు (లీగల్) : ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టం , జీఓ ంబర్ 512ను వెంటనే రద్దు చేయాలని కర్నూలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారంతో 12వ రోజుకు చేరాయి. దీక్షలో సీనియర్ న్యాయవాదులు రామశేషన్న, ఓంకార్, ప్రభాకర్‌రెడ్డి, స్వర్ణకుమారి, రాజేష్, షపత్, రవి, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కర్నూలు(సెంట్రల్): పార్లమెంట్ భద్రతపై ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపిన 146 మంది ఇండియా కూటమి ఎంపీలను సస్పెండ్ చేయడం అన్యాయమని, వెంటనే వారిపై సస్పెన్షన్ వేటును రద్దు చేయాలని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా నిర్వహించి సస్పెండ్ చేసిన ఎంపీలకు మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో నాయకులు దామోదరం రాధాకృష్ణ, జాన్‌విల్సన్, లాజరస్, ఉండవల్లి వెంకటన్న, కొత్తకోట మునన్న, డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జి.పుల్లయ్య విద్యార్థుల ఆధ్యాత్మిక యాత్ర

కర్నూలు కల్చరల్: జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు హైదరాబాద్‌లోని కన్హశాంతి వనంలో భగవద్గీతపై జరుగుతున్న వర్క్‌షాప్ పాల్గొన్నారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులు నేర్చుకోవలసిన మెళకువలెన్నో భగవద్గీతలో ఉన్నాయని, వాటిని ఆకళింపు చేసుకుని నిజ జీవితంలో ఉపయోగించినప్పుడు విజయం సాధించవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శ్రీనివాసరావు అన్నారు. కళాశాల అడ్మిన్ డీన్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎం.గిరిధర్ కుమార్ మాట్లాడుతూ భగవద్గీతను జీవిత చుక్కానిగా మలుచుకుని విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ జి.శశికుమార్, అధ్యాపకులు డాక్టర్ సి.నాగగణేష, డాక్టర్ అబ్జల్, ఎం.ఎల్లనాయుడు, రజిత తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

ఉత్సాహంగా సాగిన పోలీసు క్రీడలు



ఏపీఎస్పీ పటాలంలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న కమాండెంట్ సతీమణి వినుతా రెడ్డి

కర్నూలు : ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ 6వ ఆన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్–2023 పోటీలు రెండవ రోజు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. పటాలం కమాండెంట్ రవిశంకర్ సతీమణి వినుతా రెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పటాలం సిబ్బంది కుటుంబాలతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే బెటాలియన్స్ 3వ రేంజ్ డీఐజీ వెంకటేశ్వర్లు, కమాండెంట్ రవిశంకర్ ఆధ్వర్యంలో సిబ్బందికి వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వాలీబాల్, క్రికెట్, లాంగ్‌జంప్, హైజంప్, 400 రిలే తదితర పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. అనంతరం పటాలంలోని సాయుధపోలీసు విద్యానికేతన్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు వంద మీటర్ల పరుగు, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డ్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్‌తో పాటు ఇన్‌చార్జ్ అదనపు కమాండెంట్ రవికిరణ్, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్ఎం బాషా, భక్తవత్సలం, రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుతో పాటు ఆర్ఎస్ఐలు, పటాలం సిబ్బంది పెద్ద ఎత్తున క్రీడాపోటీల్లో పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : ఈనెల 25 వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య పిలుపు నిచ్చారు. రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్న క్రీడాకారులను శుక్రవారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో జట్టు కోచ్ ఫిజికల్ డైరెక్టర్ పాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు

'ఆడుదాం – ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం

కర్నూలు (టౌన్) : ఈనెల 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించతల పెట్టిన ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలను కలిసికట్టుగా విజయవంతం చేద్దామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో క్రీడా మైదానాన్ని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. 26 వ తేదీ చేపట్టాల్సిన స్టేజ్ ఏర్పాట్లు, క్రీడల నిర్వహణ తదితర వాటి గురించి చర్చించారు.

క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ఈనెల 26 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 3 వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం–ఆంధ్ర క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో క్రీడా ప్రతినిధుల మధ్య స్నేహపూర్వక టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

రైతుల అభ్యున్నతికి ఎస్‌బీఐ ఆర్థిక తోడ్పాటు

- జాతీయ రైతు దినోత్సవం కార్యక్రమంలో ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖమీనన్



అభ్యుదయ రైతును సత్కరిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా భారతీయ స్టేట్ బ్యాంక్ అనేక కార్యక్రమాలు చేపడుతోందని కర్నూలు ఎస్‌బీఐ పరిపాలన కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖమీనన్ తెలిపారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌బీఐ బ్రాంచీల్లో అన్నదాత దివస్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రైతు దినోత్సవం శనివారం ఉంది. ఆ రోజు బ్యాంకులకు సెలవు కావడంతో ఒక రోజు ముందుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అభ్యుదయ రైతులను సత్కరించారు. వెంకటరమణ కాలనీలోని పరిపాలన కార్యాలయంలో నిర్వహించిన కిసాన్ దివస్ లో డీజీఎం లేఖామీనన్ మాట్లాడుతూ... రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందించే లక్ష్యంతో స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఆర్ఎల్ఎం/ ఎస్ఆర్ఎల్ఎం భాగస్వామ్యంతో ఎస్‌బీఐ పనిచేస్తోందన్నారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలపై అవగాహన పెంచి బ్యాంకింగ్ వ్యవహారాలను వారి ముంగిటకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో బ్రాంచీ మేనేజర్లు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి వేడుకలు



రామానుజన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ సాయిగోపాల్, తదితరులు



గణిత నమూనాలను పరిశీలిస్తున్న రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో విద్యానగర్ మాంటిస్సోరి స్కూల్ హెచ్ఎం,ఉపాధ్యాయులు

కర్నూలు కల్చరల్: నగరంలోని పలు విద్యా సంస్థల్లో శుక్రవారం గణిత మేధావి రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల అధినేతలు, వక్తలు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రామానుజన్ ప్రపంచ మేధావుల్లో ఒకరని అందుకే ఆయన జన్మదినాన్ని జాతీయ గణిత శాస్త్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామని వక్తలు అభిప్రాయ పడ్డారు. విద్యార్థులు గణిత నమూనాలను ఏర్పాటు చేసి ప్రదర్శించారు.కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ అధ్యక్షతన జరిగిన రామానుజన్ జయంతి కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సాయిగోపాల్, ఇందిరాగాంధీ మున్సిపల్ పాఠశాలలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రంగమ్మ, ప్రధానోపాధ్యాయులు నాగశివ ప్రసాద్, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, రవీంద్ర పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో నిర్వహించిన గణిత శాస్త్ర దినోత్సవంలో పాఠశాలల ఏజీఎం రమేష్‌కుమార్, ఆర్ఐ దుర్గా లక్ష్మి, మాధవీనగర్‌లోని సాయి సుబ్బయ్య రవీంద్ర పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ పి.బి.వి.సుబ్బయ్య, కేశవరెడ్డి పాఠశాలలో విద్యా సంస్థల అధినేత ఎస్.కేశవరెడ్డి, ఆదర్శ విద్యా మందిరంలో కరస్పాండెంట్ బి.తిమ్మయ్య, విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి నిరవధిక సమ్మెలో ఉన్నట్లు చెప్పారు. తమకు పదవి విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమేశ్వరి, కృష్ణమూర్తి, రమణ, రమేష్, రామయ్య, రాజేందర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

కళాకారులకు ప్రోత్సాహం

- నేటి నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నంది నాటక పోటీలు
- జిల్లా నుంచి రెండు పద్య నాటకాలు ప్రదర్శన





ఆనంద నిలయం నాటకంలోని కళాకారుల (ఫైల్)

కర్నూలు కల్చరల్: ప్రభుత్వం కళాకారులకు అండగా నిలబడుతోంది. వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తుంది. ఈ క్రమంలో ఏపీ స్టేట్ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు గుంటూరులోని రాష్ట్రస్థాయి నంది నాటక పోటీలు నిర్వహిస్తుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో పద్య, సాంఘిక నాటకాలతో పాటు బాలల నాటికలు మొత్తం 38 ప్రదర్శితం కానున్నాయి. ఇందులో జిల్లా నుంచి రెండు పద్య నాటకాలు ఉన్నా యి. ఈనెల 26వ తేదీ సాయంత్రం టీజీవీ కళాక్షేత్రం నాటక సమాజం వారి శ్రీకృష్ణ కమల పాలిక, 29వ తేదీ ఉదయం కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం వారి ఆనంద నిలయం నాటకాలు ప్రదర్శితం కానున్నాయి.

జిల్లాకు నందుల పంటే

1998లో నంది నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. నాటి నుంచి కర్నూలు లలిత కళా సమితి/ టీజీవీ కళాక్షేత్రం, కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం, నంద్యాల కళారాధన సంస్థలు కొత్త తరహాలో నాటకాలను రూపొందించి ప్రదర్శిస్తూ నంది పురస్కారాలను కైవసం చేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు జిల్లా నాటక సమాజాలకు సుమారు 55 దాకా నంది పురస్కారాలు వరించి ఉంటాయి. ఇందులో 25 దాకా బంగారు నంది పురస్కారాలు ఉండటం విశేషం. లలిత కళా సమితి ఆధ్వర్యంలో రాయలసీమ ముఠా కక్షలపై పులిస్వారీ నాటకం 130 ప్రదర్శనలు ఇచ్చి సంచలనం సృష్టించింది. ఇదే సంస్థ అత్యధికంగా 37 నంది అవార్డులు సాధించింది. రాష్ట్రంలోనే అధిక నంది పురస్కారాలు జిల్లా కళాసమాజాలు కైవసం చేసుకుని కళలకు కందనవోలు నిలయం అనే నానుడిని నిజం చేస్తున్నాయి.

గతానికి భిన్నం.. కళాకారులు హర్షం

గతంలో జరిగిన నంది నాటకాల తీరు ఒక విధంగా ఉంటే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని మురళి కృష్ణ పర్యవేక్షణలో జరుగుతున్న నంది నాటక పోటీలు ప్రత్యేకంగా నిలవనున్నాయి. రాష్ట్రంలోని కళా సమాజాల వారిని ఆహ్వానించి వారి సలహాల సూచనలు తీసుకొని నాటక పోటీల నిర్వహణ చేపట్టారు. నాటక ప్రదర్శనల తేదీలను లాటరీ ద్వారా ఎంపిక చేయడం, నిష్పాతులైన న్యాయ నిర్ణేతలు, కళా కారులకు ప్రముఖ హోటల్స్/ లాడ్జిలలో వసతి ఏర్పాటు (గతంలో ప్రభుత్వం పాఠశాలల్లో వసతి), నాటకాల ప్రదర్శనలకు సంబంధించి టెక్నికల్‌గా ఏ నాటకానికి ఏ సెట్టింగ్, లైటింగ్ వివరాలను నాటక సమాజాల వారితో మాట్లాడి ఏర్పాటు చేయించడం, స్వయంగా చైర్మనే కళాకారులను ఆహ్వానించి శాలువా, పూల హారాలతో సన్మానం చేస్తుండటంతో కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నంది నాటక పోటీల ద్వారా కళాకారులను ప్రోత్సాహించడం శుభపరిణామమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.వి. రమణారెడ్డి పేర్కొన్నారు.